
ప్రజాశక్తి

శుక్రవారం 12 సెప్టెంబర్ 2025



మన్యం కలెక్టర్‌గా ప్రభాకర్‌రెడ్డి

శ్యామ్‌ప్రసాద్‌కు సత్యసాయి జిల్లా బదిలీ

ప్రజాశక్తి - పార్వతీపురం



జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన్ను సత్యసాయి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. జిల్లాకు కొత్త కలెక్టర్‌గా సిసిఎల్ఎ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డిని నియమించారు. గత కొంతకాలంగా కలెక్టర్ శ్యాం ప్రసాద్ బదిలీపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జిల్లాకు రెండో కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్యామ్‌ప్రసాద్ ఏడాది కాలంలో నొప్పించక తానొవ్వక అన్న రీతిలో వ్యవహరించారు. జిల్లాకి చెందిన ఓ మంత్రి, ఎమ్మెల్యేల నుంచి తీవ్ర ఒత్తిళ్లు ఎదుర్కొనడం వల్లనే బదిలీ కోసం తీవ్రంగా ప్రయత్నించారనే వాదనలున్నాయి.

గ్రానైట్ తవ్వకాలకు టిడిపి మద్దతు

- ఎలుగుల మెట్ట విధ్వంసానికి స్కెచ్
- పశువుల మేతకు నష్టమంటున్న గ్రామస్తులు
- ప్రభుత్వ అనుమతి రద్దు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని ఎలుగుల మెట్ట కొండపై గ్రానైట్ తవ్వకాలకు అధికారపార్టీకి చెందిన ఓ మంత్రి అండదండలు పుష్కలంగా ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఉత్తరాంధ్రకు చెందిన ఆ సీనియర్ మంత్రి మద్దతుతోనే గ్రానైట్ తవ్వకాల కోసం మెస్సర్స్ వెంకట సాయి గ్రానైట్స్ కంపెనీ దరఖాస్తు చేసుకుందనే ప్రచారం జరుగుతోంది. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కూడా గ్రానైట్ తవ్వకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం పర్యావరణ అనుమతులు తీసుకోవడానికి బుధవారం ఎలుగుల మెట్ట సమీపంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారనేది స్పష్టమవుతోంది. కొండ చుట్టూ పెదబొండపల్లి, హెచ్.కారాడవలసకు చెందిన రైతుల భూములు ఉన్నాయి. ఈ గ్రామాలకు చెందిన పశువులు, గొర్రెలు మేకలను కూడా ఈ కొండపైనే మేతకు వదులుతారు. గొర్రెలు, మేకలు పెంచుకుని వందలాది కుటుంబాలు పరిసర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నాయి. అంతేకాకుండా కొండపై పడిన వర్షపునీరే చెరువుల్లోకి చేరడం వల్ల సాగు, తాగునీటి అవసరాలు తీరుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కలర్ గ్రానైట్ ఉందనే కారణంతో కొండపై మైనింగ్ తవ్వకాలకు అనుమతి మంజూరు చేయడం వివాదాస్పదమవుతోంది. ఈ గ్రామాల ప్రజలకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తమ అనుకూల వ్యక్తులతో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలనే ఉద్దేశంతో అధికారులు, కంపెనీ యాజమాన్యం ప్రయత్నించారనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయాన్ని ముందుగా పసిగట్టిన గ్రామపెద్దలు



ఎలుగుల మెట్ట

పెద్ద ఎత్తున ప్రజలతో కలిసి కొండ సమీపంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ స్థలం వద్దకు చేరడంతో కథ అడ్డం తిరిగింది. ఉత్తరాంధ్ర జెఎసి అధ్యక్షుడ్నినని చెప్పుకున్న జెట్టి రామారావు గ్రానైట్ తవ్వకాలకు అనుకూలంగా మాట్లాడేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. తవ్వకాలకు అంగీకరించబోమని ఖరాఖండిగా ఎంపిటిసి ప్రతినిధి మండల పకీర్ నాయుడు, కారాడవలస నాయకులు పెద్దిరెడ్ల శ్రీవాణి స్పష్టం చేశారు. గ్రామస్తుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని విఆర్వో హేమలత, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ కరుణశ్రీ చెప్పడంతో వారు శాంతించారు. అధికారపార్టీకి కీలక మంత్రి, ఎమ్మెల్యేల అండదండలు వుండడంతో గ్రానైట్ తవ్వకాలను వ్యతిరేకంగా మాట్లాడుతున్న స్థానిక నాయకులు ఏ మేరకు ప్రజల తరపున నిలబడతారనేది ప్రశ్నార్థకంగా వుంది. గతంలో బోడికొండ, బడిదేవరకొండలపై మైనింగ్ తవ్వకాలకు సంబంధించి కూడా ప్రజాభిప్రాయం వ్యతిరేకంగా వచ్చినా ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఇప్పుడు తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. అలాంటి పరిస్థితి పునరావృతం కావొచ్చుననే ఊహాగానాలు చెలరేగుతున్నాయి.మండలంలో వందల ఏళ్ల నాటి ప్రకృతి సహజ సిద్ధమైన కొండలను మైనింగ్ పేరుతో తవ్వుకుంటూ పోతే పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం ఖాయమనే వాదనలు వినిపిస్తున్నాయి.

గ్రానైట్ తవ్వకాలను అడ్డుకుంటాం

ఎలుగుల మెట్ట కొండపై మైనింగ్ తవ్వకాలను గ్రామస్తులతో కలిసి అడ్డుకుంటాం. సహజ సిద్ధమైన కొండ వల్ల సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలకు చాలా మేలు జరుగుతోంది. గొర్రెలు, మేకలు, పశువుల మేతకు ఈ కొండే ఆధారం. దీనిపై ఆధారపడి వందలాది కుటుంబాలు బతుకుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ తవ్వకాలు జరగకుండా అడ్డుకుంటాం.

మండల పకీర్ నాయుడు,
పెదబొండపల్లి ఎంపిటిసి ప్రతినిధి.


ఎలుగుల మెట్టపై గ్రానైట్ లైసెన్స్ రద్దు చేయాలి

- ప్రజాభిప్రాయ సేకరణకు కట్టుబడి ఉండాలి
- ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్

మండలంలోని హెచ్ కారడవలస, పెద్దబొండపల్లి రెవెన్యూ పరిధిలో గల ఎలుగల మెట్టపై గ్రానైట్ తవ్వకాల కోసం బుధవారం అధికారులు చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణకు కట్టుబడి ఉండాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన గురువారం ఒక ప్రకటనను విడుదల చేశారు. గ్రానైట్ తవ్వకాలు వద్దే వద్దని యావన్మంది ప్రజలు వ్యతిరేకించారని, దీన్ని రైతు సంఘం బలపరుస్తుందని అన్నారు. తక్షణమే గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలనే ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. చిన్న గొడబ మెట్టపై క్వారీ దూళి వల్ల చెరువులు పూడుకుపోవడం, పొలాల్లో రాయి రేణువులు వెదజల్లబడి భూమి గట్టిబడిపోయి పంట దెబ్బ తినడం, ప్రజలు అనారోగ్యం బారిన కావడం, కొండకు గొర్రెలు, మేకలు, మనుషులకు ప్రవేశం లేదని యజమాని అడ్డుపడడం అందరికీ తెలిసిన విషయమేనని అన్నారు. క్వారీ యజమాని ప్రజలపై దాడులు చేయడం, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడం, అన్నిశాఖ అధికారులు యజమానికి లొంగిపోవడం అంతా విధితమేనని తెలిపారు. అదే తీరు బడిదేవరకొండ గ్రానైట్ కంపెనీ బంగారి దొరను బలి తీసుకుందన్నారు. ప్రజాభిప్రాయాలను పట్టించుకోకుండా, కార్పొరేట్ కంపెనీలకు మైనింగ్ తవ్వకాల కోసం అనుమతులు ఇవ్వడంతో ప్రజల అటవీ సంపద, ప్రకృతి వనరులు, పంట భూములు, ప్రజారోగ్యాలు పూర్తిగా దెబ్బతింటుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఎలుగల మెట్టపై గ్రానైట్ క్వారీ యాడ్‌కు అనుమతి ఇవ్వొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాదని ముందుకు వెళ్తే ప్రభుత్వం ప్రజా ప్రతిఘటనకు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

జెసిగా యశ్వంత్ కుమార్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం



జెసిగా బాధ్యతలు స్వీకరిస్తున్న యశ్వంత్‌కుమార్‌రెడ్డి

జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సి.యశ్వంత్ కుమార్ రెడ్డి గురువారం తన ఛాంబరులో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు డీఆర్వో కె.హేమలత పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి, రెవెన్యూ సర్వీసెస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, ప్రతినిధులు, తహశీల్దార్లు, జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయంలోని పలు విభాగల పర్యవేక్షకులు, సిబ్బంది జెసికి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఈ సందర్భంగా రెవిన్యూ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి క్రీడలకు సంబంధించిన కరపత్రాలను డిఆర్ఒ, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు జి.శ్రీరామ మూర్తి, ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, తహశీల్దార్ సురేష్, కలెక్టర్ కార్యాలయ ఎఒరి చిన్నారావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

సేంద్రియ ఎరువులను వాడాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

వ్యవసాయానికి యూరియా కన్నా సేంద్రియ ఎరువులు వాడడం ఉత్తమమని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. గురువారం ఆయన సోమగండిలో నిర్వహించిన ఔట్ రీచ్ ప్రోగ్రాంను పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరైన రైతులకు యూరియాతో పాటు సేంద్రీయ ఎరువులను వాడాలని పిఒ సూచించారు. సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయడం వల్ల నాణ్యతతో పాటు అధిక దిగుబడి వస్తుందన్నారు. యూరియాను అవసరమైనంత మేరకు మాత్రమే వాడాలని సూచించారు. అనంతరం సోమగండిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల ఎత్తు, బరువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమయ్యే పోషకాహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, తహశీల్దార్ శ్రీకన్య, మండల వ్యవసాయ శాఖ అధికారి వాహిని, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు రక్షణ కల్పించాలి

పంటలు నాశనం చేసిన వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి - పాలకొండ

జియ్యమ్మవలస మండలం గడసింగపురం రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 189లో సుమారు 45 ఎకరాల భూమిని గడసింగపురం, ఏనుగులగూడ గ్రామాలకు చెందిన పేదలు, గిరిజనులు గత 15 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటే ఈ పంటను కొంతమంది పెత్తందారులు మంగళవారం నాశనం చేశారని, వారిపై చర్యలు తీసుకొని గిరిజనులకు రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గంగ నాయుడు మాట్లాడుతూ గడసింగిపురం, ఏనుగులు గూడకు చెందిన దళితులు, గిరిజనులు 15 ఏళ్ల నుంచి సాగు చేస్తున్న భూమిని తమదని చెప్పి వీరఘట్టం మండలం సంతనర్సిపురానికి చెందిన కొంతమంది బిసిలు దౌర్జన్యం చేస్తున్నారన్నారు. దీనిపై వీరఘట్టం, జియ్యమ్మవలస రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. ఇదే అదునుగా ఈనెల 9న సంత నర్సిపురానికి చెందిన కొంతమంది గిరిజనులు సాగు చేస్తున్న పత్తి, జీడి మొక్కలను పీకి వేసి నాశనం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే సంత నర్సిపురంలో ఉన్న పేదలకు ఇచ్చిన పట్టా భూముల వారు సాగు చేయకపోవడంతో గిరిజనులు సాగులు చేస్తున్నారని, వీటిపై రెవెన్యూ, పోలీస్ అధికారులు సమగ్ర సర్వే చేసి వీరఘట్టం, జియ్యమ్మవలస రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేపట్టి సాగులో ఎవరు ఉన్నారు, హక్కులో ఎవరు ఉన్నారనేది సమగ్రంగా తేల్చాలని డిమాండ్ చేశారు. లేకపోతే పేదల మధ్య గొడవలు పెరిగే అవకాశం ఉందన్నారు. కావున సాగులో ఉన్న గిరిజనుల పంటలకు, భూములకు, గిరిజనులకు రక్షణ కల్పించాల్సిన అవసరం రెవెన్యూ, పోలీస్ అధికారులపై ఉందని ఆ దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు అనంతరం సబ్ కలెక్టర్ పవర్ స్వప్నల్ జగన్నాథ్‌కు వినతిని అందజేశారు. దీనికి సబ్ కలెక్టర్ మాట్లాడుతూ



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు, సిపిఎం నాయకులు

వారం రోజుల్లో జాయింట్ సర్వే జరిపిస్తామని, సమగ్ర రిపోర్టు ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. అంతవరకు ఉన్న పంటను ఎవరూ నాశనం చేయకూడదని ఆదేశాలు ఇస్తామని గిరిజనులకు హామీ ఇచ్చారు. దీంతో గిరిజనులు వెనుతిరిగారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతి రావు, జిల్లా కమిటీ సభ్యులు దావాల రమణారావు, జియ్యమ్మ వలస మండల సిపిఎం కార్యదర్శి కె.సీతారాం, సిఐటియు నాయకులు కాద రాము, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గరుగుబిల్లి రాజు, గిరిజన సంఘం నాయకులు మండంగి రామారావు, గిరిజనులు పాల్గొన్నారు.

ఏచూరి స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం

వర్ధంతి సభలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - సీతానగరం

సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్ఫూర్తితో ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఏచూరి ప్రథమ వర్ధంతి సభను సీతానగరం మండల సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వేణు మాట్లాడుతూ దేశంలో మతతత్వం, కార్పొరేట్, ప్రయివేటీకరణ, దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు ఎర్రజెండా ఆయుధంగా చేసుకుని సీతారాం ఏచూరి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయన తుది శ్వాస విడిచే వరకు ప్రజల పక్షాన గొంతెత్తిన పోరాడిన గొప్ప నేత అన్నారు. ప్రస్తుతం దేశంలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్, ప్రయివేటీకరణ విధానాలు అమలు చేస్తూ రాజ్యాంగం, లౌకికతత్వానికి ఆటంకం కలుగుతోందన్నారు. యువత భవిష్యత్ అంధకారంగా తయారైందన్నారు. సాఫ్ట్‌వేర్ రంగం కుదేలై ఉపాధిని కోల్పోయి యువత రోడ్డున పడుతున్నారని తెలిపారు. ఎన్నికల కమిషన్ భ్రష్టు పట్టిందన్నారు. ఆంధ్రుల ఆత్మాభిమానికి ప్రతిబింబంగా నాడు ఎన్టీఆర్ నిలిచిన గొప్ప చరిత్ర రాష్ట్రానికి ఉందన్నారు. నేడు అధికార, ప్రధాన ప్రతిపక్షాలు రెండూ మోడీకి మోకరిల్లుతుండడం రాష్ట్ర ప్రజల దౌర్భగ్యం అన్నారు. మోడీ ఆదేశాలు శిరసావహిస్తూ ప్రజలపై భారాలు మోపుతుండడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకునే తీరిక పాలకులకు లేదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరిస్తున్నా మాట్లాడే పరిస్థితి లేదన్నారు. ట్రంప్ తన స్నేహితుడని గొప్పలు చెప్పుకునే మోడీ ఎర్రజెండా మోస్తున్న కమ్యూనిస్టులను చైనా కుక్కలంటూ నాడు హేళన చేశాడని, అదే మోడీ కమ్యూనిస్టు దేశాలైన



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

చైనా, రష్యా అధ్యక్షులను కలిసి ఒకరినొకరు ఇచ్చిపుచ్చుకునే సంప్రదాయం కొనసాగిద్దామనే నూతన అధ్యాయం ఆరంభించాడని తెలిపారు. సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి కార్యక్రమం మండల వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏచూరి సేవలు కొనియాడుతూ పాలకులు చేస్తున్న అస్తవ్యస్థ విధానాలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాలు జరుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు, గవర వెంకటరమణ, రెడ్డి లక్ష్మ నాయుడు, ఆర్,రమణమూర్తి, ఆర్.సత్యనారాయణ, వై.రామారావు, బి.అప్పారావు, సిహెచ్. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ హేమలత

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

నవోదయ 2.0 కింద నాటు సారా రహిత జిల్లాగా పార్వతీపురంను తీర్చిదిద్దాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత తెలిపారు. సంబంధిత అధికారుల సమష్టి కృషితోనే అది సాధ్యమౌతుందని అన్నారు. జిల్లాకు సమీపంలో ఒడిశా సరిహద్దు ప్రాంతాలున్నందున అంతర్ రాష్ట్ర తనిఖీలను మరింత విస్తృతం చేయాలన్నారు. నాటు సారా తయారీ, విక్రయాలపై పీడీ యాక్టు పటిష్టంగా అమలు చేయాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శాఖాధికారులతో నవోదయ 2.0 కార్యక్రమంపై జిల్లా సమన్వయ సమావేశం డీఆర్ఓ అధ్యక్షతన గురువారం జరిగింది. నవోదయం 2.0తో నాటు సారా తయారీదారుల్లో మార్పు రావాలని, శాశ్వతంగా వారిలో పరివర్తన వచ్చేలా ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి డిఆర్‌డిఎ ద్వారా చేయూతను అందించడం ద్వారా వారిలో మార్పు వస్తుందని తెలిపారు. ఎక్సైజ్, ప్రోహిబిషన్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలో 137 గ్రామాలను ఎ,బి,సి గ్రామాలుగా వర్గీకరించి, సదరు గ్రామాలకు దత్తత అధికారులను నియమించినట్లు తెలిపారు. నాటు సారా సంబంధిత ఫిర్యాదులు కోసం టోల్ ఫ్రీ నెంబర్ 14405పై విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. గోడ పత్రికలు, కరపత్రాలు, ప్రచార రథం ద్వారా నవోదయ 2.0పై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని, తద్వారా వారిలో చైతన్యం వచ్చినట్లు పేర్కొన్నారు. పోలీస్ శాఖ సహకారంతో అంతరాష్ట్ర దాడులు నిర్వహిస్తున్నామని, గత 4 మాసాల్లో 227 కేసులు పెట్టి, 337 మందిని అరెస్ట్ చేశామన్నారు. 9,090 లీటర్ల నాటుసారాను, 35,740 లీ. పులియబెట్టిన నల్లబెల్లాన్ని ధ్వంసం చేసినట్లు చెప్పారు. 38 వాహనాలను సీజ్ చేశామని, ఆర్.కె.బట్టివలస, జగన్నాథపురం, కష్ణపల్లి, విక్రంపురం వద్ద చెక్ పోస్టుల ద్వారా విస్తత తనిఖీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాడులు, తనిఖీల నేపథ్యంలో చాలావరకు నాటు సారా అరికట్టామని, పూర్తిగా నివారించేందుకు కృషి చేస్తామని ఆయన వివరించారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాధుడు, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఆర్.కృష్ణవేణి, అసిస్టెంట్ ప్రోహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎక్సైజ్ ఇనస్పెక్టర్లు, పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

ఎన్నికల ముందు టిడిపి కూటమి పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలకు విరుద్ధంగా సూపర్ సిక్స్ హామీల అమలు జరుగుతుందని, అలాంటప్పుడు అవి హిట్ కాదని, సూపర్ ఫ్లాప్ అని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల అమలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని అనంతపురం జిల్లాలో గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ హామీని అమలు చేయలేదని చెప్పారు. మేనిఫెస్టోలో ఒకలా హామీ లిచ్చి అధికారంలోకి వచ్చిన మరోలా అమలు చేయడం ప్రజలను మభ్యపెట్టడమేనని ఆరోపించారు. నిరుద్యోగులకు 20లక్షల ఉద్యోగాలిస్తామని, లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని, బిసిలకు 50ఏళ్లకే పింఛను మంజూరు చేస్తామని, ఆడబిడ్డ నిధి కింద మహిళలకు నెలకు రూ.1500 చొప్పున చెల్లిస్తామని ఇచ్చి హామీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీల్లో కీలకమైన హామీలు అమలు చేయకుండానే సూపర్ హిట్ అని డబ్బా కొట్టుకోవటం హాస్యాస్పదంగా ఉందని రాజన్నదొర అన్నారు.

స్వదేశానికి చేరుకున్న గుమ్మలక్ష్మీపురం వాసులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



విశాఖకు చేరుకున్న మండల వాసులు

నేపాల్ సందర్శనకు వెళ్లిన పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం ప్రాంత వాసులు స్వదేశానికి గురువారం మధ్యాహ్నం క్షేమంగా చేరుకున్నారు. ఒడిశా ప్రాంతానికి చెందిన కొంతమందితో కలిసి గుమ్మలక్ష్మీపురం ప్రాంతవాసులు వెంకట్రావు, సంతోషి లక్ష్మీ, కేదారిపురానికి చెందిన సుబ్బారావు నేపాల్ దేశం సందర్శనకు వెళ్లి అక్కడ జరుగుతున్న అల్లర్లులో చిక్కుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ప్రభుత్వం చొరవతో గురువారం ఉదయం ఖాట్మాండు విమానాశ్రయానికి, అక్కడ నుంచి మధ్యాహ్నం విశాఖపట్నం క్షేమంగా చేరుకున్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు, మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను విచారిస్తున్న పోలీసులు

కలుషిత ఆహారంతో ఆరుగురికి అస్వస్థత

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండలంలోని గంగాపురం పంచాయతీ పనసభద్రలో, ఒక కుటుంబానికి చెందిన ఆరుగురు తమ ఇంట్లో వండిన ఆహారం తిని అస్వస్థతకు గురైన సంఘటన చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై సంతోషి కుమారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పనసభద్రకు చెందిన మువ్వల లక్ష్మి (60), మువ్వల శాంతమ్మ (56), మువ్వల సావిత్రి (48), మువ్వల తవిటమ్మ (38), మువ్వల రమణమ్మ(30) మొబైల్ రమేష్ అలియాస్ చరణ్(19) ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు. దీనికి ప్రధాన కారణం కూరలో నూనె అనుకుని పొరపాటున గడ్డి మందు వేసి వండడంతో ఆ ఆహారం తిన్న వెంటనే అస్వస్థతకు గురవడంతో చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రిలో చేరారు.వైద్యులు చికిత్స అందిస్తున్నారని కుటుంబ సభ్యులందరూ క్షేమంగా ఉన్నారని రూరల్ ఎస్సై తెలియజేశారు.

నేడు డయల్ యువర్ డిపిటిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా పరిధిలోని ప్రజా రవాణా సమస్యలను తెలియజేసేందుకు శుక్రవారం డయల్ యువర్ డిపిటిఒ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణాధికారి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 11గం.ల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డిపిటిఓ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజా రవాణాలో తమ సమస్యలు, సలహాలు, సూచనలు చేయాలనుకునే వారు 99592 25605 నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయ వచ్చని ఆయన ఆ ప్రకటనలో కోరారు.



నిరసన తెలుపుతున్న రైతులు

ఒకే వీధికి 400 యూరియా బస్తాలు

వివక్షతపై రైతుల మండిపాటు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఒకే వీధికి 400 యూరియా బస్తాలు పంపిణీ చేయడమేమిటని మండల కేంద్రంలోని పెరుగు, గొల్ల, చెగిడి, లంక వీధిలకు చెందిన రైతులు గురువారం స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్న రైతు సేవా కేంద్రం వద్ద వ్యవసాయ అధికారులను నిలదీశారు. కూరగాయల రైతులకు 400 బస్తాలు ఇస్తే, వరి పండించిన వేలాది మంది ఉన్న అన్నదాతలకు యూరియా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రైతుల్లేని సమయంలో ఇంటికి వచ్చి స్లిప్పులు ఇచ్చారని, ఇప్పుడు తమకు యూరియా కావాలని వ్యవసాయ అధికారులు డిమాండ్ చేశారు. గతంలో కూడా ఆ వీధికే రెండు సార్లు యూరియా ఇచ్చారని, మరల ఒకేసారి 400 యూరియా బస్తాలు పంపిణీ చేయడమేమిటని అన్నారు. ఈ విషయమై వ్యవసాయ అధికారి జె.సౌజన్య వద్ద ప్రస్తావించగా హార్టికల్చర్ ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఏ వీధి అన్నదాతలకు యూరియా అందలేదో వారి వివరాలను నమోదు చేసి మండలానికి యూరియా వచ్చినప్పుడు మొదట ప్రాధాన్యత వారికే ఇస్తామని ఆమె వివరణ ఇచ్చారు.

క్లస్టర్ విధానాన్ని మార్చాలి

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామ సచివాలయ ఉద్యోగులకు క్లస్టర్ అప్పగింత విధానాన్ని మార్పు చేయాలని గ్రామ సచివాలయ ఉద్యోగ సంఘ నాయకులు జెవి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించి అనంతరం ఇంచార్జ్ ఎంపిడిఒ కెకె. కుమార్ వర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి సర్వేల పేర్లతో ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్ శైలజ

పశువులకు లింగ నిర్ధారిత ఇంజెక్షన్ తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

పశువులకు లింగ నిర్ధారిత ఇంజక్షన్ తప్పనిసరి అని పశు వైద్యాధికారి కె.శైలజ అన్నారు. గురువారం మండలంలో గుజ్జువాయి, జి. సివడ పంచాయతీల్లో పశువులకు లింగ నిర్ధారిత ఇంజక్షన్ వేయడం వల్ల కలిగే ప్రయోజనాలు గూర్చి పాడి రైతులకు వివరించి, కోలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ పశువులకు లింగ నిర్ధారిత ఇంజక్షన్ తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ అఖిలేష్, సచివాలయం పశు వైద్యసహాయకులు గంగారావు, పార్వతి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ఉత్తమ లక్షణాలు

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థి దశ నుంచే ఉత్తమ లక్షణాలు అలవర్చుకోవాలని కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.గణేష్ అన్నారు. గురువారం విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉత్తమ లక్షణాలను అలవర్చుకొని సక్రమంగా చదువుకుంటే ఉన్నత స్థానంలో స్థిరపడగలరని, ప్రతి ఒక్క విద్యార్థీ చెడు వ్యసనాలకు బానిస కాకుండా సక్రమంగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టిపూడివలసలో వైద్య శిబిరం

వీరఘట్టం: మండలంలోని చిట్టిపూడివలసలో గురువారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణులు, బాలింతలు, రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి వై పవిత్ర, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, రోగులు, పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈనెల 12వ తేదీ నుండి మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు కెపి నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు బాయ్స్ అండ్ గర్ల్స్ స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించనున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలన్నారు.

రిజిస్ట్రార్‌కు సన్మానం

సీతంపేట: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో నూతన రిజిస్ట్రార్‌గా నియమితులైన ప్రొఫెసర్ బిడ్డిక అడ్డాయికి ఆయన ఛాంబర్‌లో గురువారం ఆదివాసి సంఘ నాయకులు సవర చిరంజీవులు, ఆరిక నరసింహులు, సవర సూర్యం, ప్రతాప్ తదితరులు సన్మానించారు. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం నల్లరాయిగూడకు చెందిన అడ్డాయి మారుమూల గ్రామానికి చెందినవారైనప్పటికీ మంచి గుర్తింపును సాధించారని కొనియాడారు.

విద్యుత్ శాఖ ఎఇగా సింహాచలం

మక్కువ: మండల విద్యుత్‌శాఖ ఎఇగా దాసర సింహాచలం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన పాచిపెంట మండలంలో విద్యుత్‌శాఖ ఎఇగా పనిచేస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసి ఉన్న నేపథ్యంలో ఆయనకు అదనపు బాధ్యతలు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు అప్పగించారు.

గిరిజన యువకుడు అదృశ్యం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని జర్న గ్రామానికి చెందిన వాటక భాగల అనే గిరిజన యువకుడు (31) రెండు నెలలుగా కనిపించడం లేదని గురువారం ఎల్విన్‌పేట పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. తమ గ్రామానికి దగ్గరలో ఉన్న కూనేరు సంతకు జూలై 21న వెళ్లి తిరిగి ఇంతవరకు ఇంటికి రాలేదని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలలో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదన్నారు. తప్పి పోయిన వాటక భాగలకు పుట్టినప్పటి నుంచి మాటలు రావు అని, చెవులు వినిపించవు అని చెప్పారు. తప్పిపోయిన వ్యక్తి ఎవరికైనా కనిపిస్తే ఎల్విన్ పేట సిఐ 9491906485, ఎస్ఐ 7981296171 నెంబర్‌లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మందుగుండు సామగ్రి స్వాధీనం

కొమరాడ: మండలంలో అక్రమంగా నిల్వ ఉన్న మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ నీలకంఠం తెలిపారు. గురువారం సాయంత్రం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు శివిని గ్రామ సమీపంలో నిల్వ ఉన్న మందు గుండును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ గ్రామంలో శివకాశి నుంచి మందు గుండు సామగ్రిని అక్రమంగా తెచ్చి నిల్వ ఉంచినట్లు సమాచారం వచ్చిందన్నారు. దీపావళి మందుగుండు సామాగ్రి అక్రమంగా నిల్వ చేసి ఉన్నారని సమాచారంతో వెళ్లి సదరు ప్రదేశాన్ని తనిఖీ చేసి శివిని గ్రామానికి చెందిన సేనాపతి రాజేష్ అనే వ్యక్తి నిల్వ ఉంచినట్లు గుర్తించామన్నారు. దీపావళి, రానున్న దసరా పండగ సందర్భంగా తమిళనాడు శివకాశి మందుగుండి తెప్పించి అక్రమంగా భద్రపరిచి ఉండడంతో సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి సుమారు రెండు లక్షలు విలువైన సామాగ్రిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించామన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి భవిష్యత్తునూ తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని మన్యం జిల్లా విద్యాశాఖ అధికారి రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలో ఉన్న పలు ప్రైమరీ, జిల్లా పరిషత్, కేజీబీవీ, గురుకుల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కోటిపాం, కొమరాడ జిల్లా పరిషత్ హైస్కూలు, గుమడ మండల ప్రైమరీ పాఠశాలను, కేజీబీవీ పాఠశాల గిరిజన బాలుర పాఠశాలను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పలు తరగతి గదిలో విద్యాబోధనలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి పలు ప్రశ్నలను అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఇటీవల జరిగిన ఎఫ్ఎ ఒన్ పరీక్షలు సంబంధించి మార్కులపై ఆరా తీశారు. ఈ పర్యటనలో మండల విద్యాశాఖ అధికారి జామి నారాయణస్వామి, ఉపాధ్యాయులు సిబ్బంది ఉన్నారు.



విద్యార్థుల హోమ్‌వర్క్‌ను పరిశీలిస్తున్న డిఇఒ రాజ్‌కుమార్

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులకు డిఇఒ సన్మానం

మన్యం జిల్లా మారుమూల మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ఉత్తమ స్థాయి అవార్డు రావడం చాలా గొప్ప విషయమని జిల్లా విద్యాశాఖ అధికారి రాజ్‌కుమార్ అన్నారు. గురువారం గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రధానాచార్యులు డి. లక్ష్మణరావును అభినందించి సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ మారు మూల గిరిజన పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్తుకు కృషిచేసిన ప్రధానోపాధ్యాయులు లక్ష్మణరావును ప్రభుత్వం గుర్తించడం చాలా సంతోషకరమన్నారు. వివిధ రంగాల్లో విద్యార్థులను విద్య బోధనలు చేపిస్తూ వారిని క్రమశిక్షణగా బాధ్యతగా చదువుపై దృష్టి పెట్టే విధంగా కృషి చేయడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నారాయణస్వామి, ఎపిఒ శంకర్రావు, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యుపిసి పరిశీలన

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని తామరకండి ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాన్ని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కెకె కుమారవర్మ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుచేసి వర్మీ కంపోస్టు తయారుచేసి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని, దీని ద్వారా ఆర్థిక వనరులు పంచాయతీ సేకరించుకోవాలని అన్నారు. అలాగే నీళ్ల ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. ప్రతిరోజు ఇ-వ్యాప్‌ను వినియోగించి ఎస్ డబ్ల్యు బిసి కేంద్రాలను వ్యాప్‌ల ద్వారా ప్రతిరోజు నమోదు చేయాలన్నారు. సీజన్ కావడంతో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎన్ సురేష్, కుమార్, గ్రామ క్లాప్ మిత్రులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన కల్పించాలి : ఎన్‌సిడిపిఒ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. ఎన్‌సిడి 4.0లో భాగంగా కేన్సర్ స్క్రీనింగ్‌పై సిహెచ్‌ఒ, ఎఎన్ఎంలకు గురువారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ శోభారాణి, దంత వైద్యులు డాక్టర్ సుకృత పవర్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ అందించారు. శిక్షణా కార్యక్రమంలో డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ కేన్సర్‌లో ముఖ్యంగా నోటి, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్ లక్షణాలను ముందుగానే వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో గుర్తించాలని, అనంతరం వైద్యాధికారి ద్వారా నిర్దేశించిన ఆంకాలజీ విభాగానికి (పిఒయు)తుది నిర్ధారణకు రిఫర్ చేయాలని అన్నారు. సకాలంలో గుర్తించి, సరైన చికిత్స అందిస్తే కేన్సర్ ముప్పు తప్పుతుందన్నారు. డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా ఎన్సీడి శిక్షణ ఇస్తున్నామన్నారు. వైద్య తనిఖీలు, పరీక్షలతో కేన్సర్ అనుమానిత లక్షణాలను వైద్య సిబ్బంది ఎలా గుర్తించాలి, తదుపరి కార్యాచరణపై శిక్షణలో వివరించిన అంశాల్ని క్షేత్ర స్థాయిలో పక్కగా అమలు జరిపి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. బిపి, షుగరు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను పర్యవేక్షణ చేయాలన్నారు.



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రావు

ఎరువుల సరఫరాపై వాస్తవాలు తెలియాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలో ఎరువులు లభ్యత, సరఫరాపై ప్రజలకు వాస్తవాలు స్పష్టంగా తెలియాలని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని రాజకీయ రంగంలోకి లాగి రైతుల పేరుతో నాటకాలు ఆడటమే వైసిపి విధానమని మండిపడ్డారు. వైసిపి ఐదేళ్ల పాలనలో రైతుల కష్టాలను పట్టించుకోని జగన్ ఇప్పుడు రైతుల పేరు చెప్పి డ్రామాలు ఆడటం సిగ్గుచేటన్నారు. ఎరువులు అందడం లేదని రైతులు ఏమైనా మీకు చెప్పారా అని ప్రశ్నించారు. ఈ మధ్యకాలంలో వైసిపి చేసిన కార్యక్రమాలకు ప్రజలు హర్షించలేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో నియోజకవర్గంలో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం 6.91 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతుల కోసం కేటాయించామన్నారు. ఇప్పటి వరకు రైతులు 6.11 లక్షల మెట్రిక్ టన్నులు యూరియాను కొనుగోలు చేశారని చెప్పారు. ప్రస్తుతం 80,503 మెట్రిక్ టన్నులు నిల్వ ఉందన్నారు. త్వరలోనే మరో 30 వేల మెట్రిక్ టన్నులు చేరతాయని అన్నారు. రబీ సీజన్ కోసం 9.38 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా సిద్ధం చేస్తుందని అన్నారు.



మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని పెద్ద బొండపల్లి, హెచ్ కారాడవలస రెవెన్యూ పరిధిలో ఉన్న ఎలుగుల మెట్టపై మైనింగ్ క్వారీ అనుమతులు రద్దు చేయా లని వామ పక్ష, గిరిజన సంఘాల నాయ కులు డిమాండ్ చేశారు. దీనివల్ల వంద లాది ఎకరాల పంట భూములు నష్టపోవడమే కాకుండా ప్రజలు ముఖ్యంగా పశువుల పెంపకదారులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు .అలాగే పర్యావరణం దెబ్బతినే పరిస్థితి తలెత్తుతుందని వారు పేర్కొన్నారు. గురువారం ఆ పార్టీ నాయకులతో కలిసి ఎలుగులమెట్ట కొండను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండపై మైనింగ్ చేపట్టేందుకు ప్రభుత్వం వెంకటసాయి గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు జారీ చేసినట్లు తెలుస్తుందన్నారు. ఈ నేపథ్యంతోనే నామమాత్రంగా అధికారులు నాయ కులు కలిసి తూతూ మంత్రంగా ప్రజా భిప్రాయ సేకరణ గోప్యంగా చేపట్టారని వారు ఆరోపించారు. ప్రజాభిప్రాయ సేకరణ అంటే ప్రజలకు, స్థానిక నాయ కులకు ఆయా గ్రామాల ప్రజానీకానికి ముందస్తుగా తెలపాలని, అలా చేయ కుండా అత్యంత గోప్యంగా నిర్వహిం చేందుకు ఏమిటి కారణమని ప్రశ్నిం చారు. కొండ చుట్టూ వందలాది ఎకరాల పంట భూములున్నాయని, అలాగే వేసవిలో పాడి పశువులకు పశు గ్రాసం కోసం పాడి రైతులు కొండపైకి పశువులను తీసుకువస్తుంటారని గుర్తు చేశారు. ఈ పర్యటనలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్‌విఎస్ కుమార్, ఇవి నాయుడు, సింహాద్రి దుర్గారావు సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు సంఘం, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, సంతోష్ సీతారాం, సిహెచ్ విజయ్ కుమార్ స్థానికులు పాల్గొన్నారు.



మెట్టను పరిశీలిస్తున్న నాయకులు

బకాయి వేతనాలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి- సీతానగరం

పంచాయతీలలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు బకాయి వేతనాలు చెల్లించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, గ్రామపంచాయతీ గ్రీన్ అంబాసిడర్ల మండల నాయకులు జలుమూరు గౌరి డిమాండ్ చేశారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అనంతరం ఇంచార్జి ఎంపిడిఒ కెకె వర్మకి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ మాట్లాడుతూ పంచాయతీలలో పారిశుధ్యం మెరుగుకు ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్స్ కార్మికుల పట్ల ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం నేరుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పాత వేతనాల బకాయిలు ఉన్నాయని, సుమారు ఎనిమిది నెలల వేతనాలు చెల్లించాల్సి ఉందని దీనికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. ప్రభుత్వం హెల్త్ అలవెన్స్ నాలుగు వేల రూపాయలు జీతంతో కలిపి చెల్లించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ అవి అమలు చేయడం లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు జలుమూరు గౌరి, సిల్లా పోలీస్, పెంకి తిరుపతి, గుంట పోలయ్య, కరుణాకర్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున పారిశుధ్య కార్మికులు

ఉపాధ్యాయ సమస్యలపై నిరసన

ప్రజాశక్తి - పాలకొండ

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం నిరసన చేపట్టారు. మండలంలోని ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. పెండింగ్లో ఉన్న డిఎలు ప్రకటించాలన్నారు. పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలని, సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బివి రమణ, కార్యదర్శి కె.పద్మజ, గౌరవ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శాసప వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని నడిమికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఎపిటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన వారం కార్యక్రమంలో భాగంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెండింగ్లో ఉన్న నాలుగు డిఎలను తక్షణమే విడుదల చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని, మెమో 57ను తక్షణం అమలు చేయాలని, 12వ పిఆర్‌సి కమిషన్ నియమించాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, ఇహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, యాప్‌లను అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలు రద్దు చేయాలని, ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని తదితర అంశాలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం మురళి, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

జెవివి రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

విజయనగరంలో ఈనెల 13,14 తేదీల్లో నిర్వహించనున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.మహేశ్వరరావు, కె.గౌరునాయుడు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. విజయనగరం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో జరిగే ఈ రాష్ట్ర మహాసభల్లో ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథి మాజీ ఎమ్మెల్సీ ప్రముఖ సామాజిక రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ హాజరై ప్రసంగిస్తారని, విద్యా వేత్తలు, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు హాజరవుతారని అన్నారు. అదేవిధంగా సమకాలీన అంశాలపై చర్చలు, మ్యాజిక్కులు షోలు, సైన్స్ ఎగ్జిబిషన్లు, పలు సాంస్కృతి కార్యక్రమాలతో మొదలైన సైన్స్ పండుగను తలపించేలా రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని తెలిపారు. జన విజ్ఞాన వేదిక నాయకులు, కార్యకర్తలు సైన్స్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు. విలేకరుల సమావేశంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షులు ఎం.గౌరీశ్వరరావు, పాలకొండ డివిజన్ ప్రధాన కార్యదర్శి అలజంగి చిన్నారావు, చెకుముకి సభ కమిటీ కన్వీనర్ రఘుమండల ధనుంజయ నాయుడు, యూత్ సబ్‌కమిటీ కన్వీనర్ దుర్గాప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు వై రాజు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - కొమరాడ

కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా మార్పు చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సిహెచ్ డబ్ల్యులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మారుమూల గిరిజన ప్రాంతంలో ఆరోగ్య సేవలు అందించడానికి పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 1190 మంది, సీతంపేట ఐటిడిఎ పరిధిలో 375 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా ఆరోగ్య సేవలు అందిస్తున్నారని అన్నారు. వీరికి ప్రభుత్వం రూ. 4వేలు మాత్రమే పారితోషికం ఇస్తుందని ఇది కూడా సకాలంలో ఇవ్వడం లేదని చెప్పారు. వెంటనే పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొమరాడ

ఆటో డ్రైవర్ జి.సురేష్ కుటుంబానికి ఆ యూనియన్ సంఘం నాయకులు ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి భరోసా కల్పించారు. గురువారం కొమరాడ మండల కేంద్రంలో నివాసముంటున్న ఆటో డ్రైవర్ గుత్తవిల్లి సురేష్ కుమార్తె ఆకస్మాత్తుగా రెండు రోజుల క్రితం మృతి చెందింది. మరణించిన విషయాన్ని తెలుసుకున్న సిఐటియు అనుబంధ సంస్థ శ్రీ మజ్జి గౌరీ ఆటో యూనియన్ నాయకులు గోపి, శ్రీను మిగతా వారు కలిసి ఆర్థిక సహాయం కింద రూ.5000 తమ నివాసానికి వెళ్లి అందజేసినట్టు యూనియన్ నాయకులు గోపి తెలిపారు. ఈ సందర్భంగా హరి కుటుంబానికి సంతాపన తెలిపారు.

ఎరువుల సమాచారానికి కలెక్టరేట్‌లో కాల్ సెంటర్

పార్వతీపురం: జిల్లాలో యూరియా, ఎరువుల సమాచారం కోసం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కాల్ సెంటరును ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఎరువులు, యూరియాకు చెందిన ఏవైనా సూచనలు, మార్గదర్శకాలు, సమాచారం కోసం కార్యాలయ పనివేళల్లో (సెలవు రోజులు మినహా) 08963359853 నెంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - కురుపాం

నాటు సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ఎక్సైజ్ సిబ్బంది కృషి చేయాలని ప్రొబిషన్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పైడి రామచంద్రరావు అన్నారు. గురువారం కురుపాం ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఇంతవరకు ఉన్న పెండింగ్ కేసులు సర్కిల్ పరిధిలో ఉన్న నాటుసారా స్థావరాల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు గ్రామాల్లో రాత్రిపూట కాపు కాసి నాటు సారా తయారీ సరఫరాలను నిరోధించి సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ పి.శ్రీనివాసరావు, ఎస్ఐ జె.రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న రామచంద్రరావు

చక్కగా బోధించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రీస్కూల్ విద్యార్థులకు విద్యాబోధన చక్కగా నేర్పించాలని ఐసిడిఎస్ పిఒ జి.సుగుణకుమారి అన్నారు. గురువారం కొమరాడ ప్రాజెక్టు కార్యాలయం వద్ద మండలంలో ఉన్న అంగన్వాడి కార్యకర్తలకు విద్యా బోధనలు, రక్తహీనత నివారణ కోసం న్యూట్రిషన్ ఫుడ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీస్కూల్లో చక్కగా విద్యార్థులకు విద్యాబోధన నేర్పించి వారి భవిష్యత్తుకు మంచి పునాది బాట వేయాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుతం ఇస్తున్న న్యూట్రిషన్ ఫుడ్‌ను సక్రమంగా అందించి వారి ఆరోగ్యానికి కృషి చేయాలన్నారు. ప్రతి అంగన్వాడి కేంద్రం వద్ద మొక్కలు నాటి కేంద్ర పరిసర ప్రాంతాలు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రథమ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ జీవిత, సూపర్‌వైజర్లు శారదాంబ, లక్ష్మి, బంగారమ్మ, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిఒ సుగుణకుమారి

13, 14 తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభ

ప్రజాశక్తి - పాలకొండ

ఈనెల 13,14 తేదీల్లో పాలకొండలో జరిగే సిఐటియు జిల్లా 11వ మహాసభలను జయప్రదం చేయాలని శ్రామిక మహిళ సంఘం పాలకొండ ప్రాంత నాయకులు ఎన్.హిమప్రభ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ మహాసభలు సందర్భంగా శనివారం ఉదయం 13న ఉదయం 10 గంటలకు దుర్గగుడి సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన, అనంతరం ఆర్‌టిసి కాంప్లెక్స్ హౌ టు గెట్ ఎదురుగా బహిరంగ సభ జరుగుతాయని, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, కార్యదర్శి కె.సుబ్బారావమ్మ హాజరవుతారని తెలిపారు.

అధిక సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు, అంగన్వాడీ, ఆశా, ఎండిఎం, వంట కార్మికులు, స్కీ వర్కర్స్, శ్రామిక మహిళలు, అసంఘటిత రంగ కార్మికులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో శ్రామిక మహిళలు ఎ.పద్మ, ఎం.శ్రీదేవి, రజిని, సుశీల, ఎం.పద్మ, సంతోషి తదితరులు పాల్గొన్నారు

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-సీతానగరం

పురుగుల మందుల దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ గురువారం తనిఖీలు చేశారు. బజార్లో ఉన్న అమ్మా పురుగుల మందు షాపు రికార్డులను, స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పురుగుల మందు షాపు ధరల పట్టిక బయట ఉంచాలన్నారు. జిఎస్‌టిలో ఉన్న డోర్ నెంబర్‌ను బయట ఉంచాలన్నారు. అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎఒ అవినాష్

రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఆర్థిక బకాయిల కోసం ఈనెల 15 నుంచి యుటిఎఫ్ ఆధ్వర్యంలో జీపు జాతా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తూ ఈ నెల16న సాయంత్రం సాలూరు ప్రాంతానికి చేరుకొనే సందర్భంగా రణభేరి పోస్టర్‌ను యుటిఎఫ్ నాయకులు మండలంలో వివిధ పాఠశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అసోసియేట్ అధ్యక్షులు బి.విజయ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని, పాఠశాలల్లో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని, ఉమ్మడి సర్వీసు రూల్స్ ద్వారా ప్రమోషన్లు కల్పించాలని, 12వ పిఆర్సి కమిషనర్‌ను వెంటనే నియమించాలని, డిఎలు విడుదల చేయాలని, బకాయిలు చెల్లించాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.జానకీరావు, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఐ.రాజమణి, మండల యుటిఎఫ్ అధ్యక్షులు ఎ.సీతయ్య, ప్రధాన కార్యదర్శి అనకాపల్లి గణేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అవ్వ రామారావు, ఎ.మన్మథరావు, కె.మీనా, కార్యకర్తలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు